
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

అల్లూరి సీతారామరాజు
జిల్లా వార్తలు
మంగళవారం 23 జనవరి 2024

తూనికల్లో మోసాలపై సీరియస్

పెదబయలు, జనవరి 22: వారపు సంతలో తూనికల్లో జరుగుతున్న మోసాలపై తూనికలు, కొలతల శాఖ రాష్ట్ర అధికారి కేటీ రవి కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పెదబయలులో జరిగిన వారపు సంతను సిబ్బందితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. తూనికల్లో వ్యత్యాసం, కాటాలకు సీల్ లేకపోవడం, అధిక ధరలకు విక్రయిస్తున్న 11 దుకాణాల యజమానులపై ఆయన కేసులు నమోదు చేశారు. అనకాపల్లి అసిస్టెంట్ కంట్రోలర్ అధికారి బి.రామచంద్రయ్య, ఇన్‌స్పెక్టర్లు వి.రామారావు, డి.అనురాధ వున్నారు.

జిల్లా ఓటర్లు 7,61,255


తుది జాబితా విడుదల

పురుషులు 3,66,386,
మహిళలు 3,94,832,
ఇతరులు 37 మంది

గత ఐదేళ్లలో 1,10,290 మంది ఓటర్లు పెరుగుదల

పాడేరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో తుది ఓటరు జాబితాను అధికారులు సోమవారం ప్రకటించారు. జిల్లాలోని 22 మండలాల్లో 7 లక్షల 61 వేల 255 మంది ఓటర్లున్నారు. వారిలో పురుషులు 3,66,386 మంది, మహిళలు 3,94,832 మంది, ఇతరులు 37 మంది ఉన్నారు.

జిల్లాలో పాడేరు అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 2 లక్షల 44 వేల 925 మంది ఓటర్లు కాగా, వారిలో పురుషులు 1,18,154 మంది, మహిళలు 1,26,755 మంది, ఇతరులు 16 మంది ఓటర్లున్నారు. అలాగే అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో మొత్తం 2 లక్షల 41 వేల 360 మంది ఓటర్లలో పురుషులు 1,17,460 మంది, మహిళలు 1,23,894 మంది, ఇతరులు 6 మంది ఓటర్లున్నారు. అలాగే రంపచోడవరం అసెంబ్లీ నియోజవర్గంలో మొత్తం ఓటర్లు 2 లక్షల 74 వేల 970 మంది ఓటర్లలో పురుషులు 1,30,772 మంది, మహిళలు 1,441,83 మంది, ఇతరులు 15 మంది ఓటర్లున్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,021 పోలింగ్ కేంద్రాలు కాగా, వాటిలో పాడేరు నియోజకవర్గంలో 318, అరకులోయలో 304, రంపచోడవరంలో 399 పోలింగ్ కేంద్రాలున్నాయి.

గత ఐదేళ్లలో పెరిగిన ఓటర్లు 1,10,290 మంది

జిల్లాలో గత ఐదేళ్లలో 1,10,290 మంది ఓటర్లు పెరిగారు. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయానికి జిల్లాలో మొత్తం 6 లక్షల 50 వేల 965 మంది ఓటర్లుండగా, తాజాగా వెల్లడించిన జాబితా ప్రకారం 7 లక్షల 61 వేల 255 మంది ఓటర్లున్నారు. అంటే అదనంగా ఒక లక్షా 10 వేల 290 మంది ఓటర్లు పెరిగారు.

సంవత్సరం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
2019	3,16,933	1,34,011	21	6,50,965
2024	3,66,386	3,94,832	37	7,61,255

సజావుగా ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

కలెక్టర్ సుమిత్‌కుమార్


వివిధ రాజకీయ పార్టీల నేతలతో సమావేశమైన కలెక్టర్ సుమిత్‌కుమార్

పాడేరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలకు చెందిన నేతలు సంపూర్ణంగా సహకరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ కోరారు. కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీ నేతలతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు సవరణల అనంతరం తుది ఓటరు జాబితాలను విడుదల చేశామన్నారు. అలాగే సవరణలో భాగంగా శాశ్వత వలస, మృతి చెందిన 19,394 ఓట్లను తొలగించామన్నారు. ఓట్ల తొలగింపు ప్రక్రియలో ఎన్నికల కమిషన్ సూచనలు పాటించడంతోపాటు స్థానికంగానే పక్కాగా పరిశీలన, నిర్ధారణ చేశామన్నారు. కొత్తగా 40,096 మందిని ఓటరు జాబితాలో చేర్చామన్నారు. అన్ని ప్రక్రియల అనంతరం జిల్లాలో మొత్తం 7 లక్షల 61 వేల 255 మంది ఓటర్లు కాగా, వారిలో పురుషులు 3,66,386 మంది, మహిళలు 3,94,832 మంది, ఇతరులు 37 మంది ఓటర్లున్నార న్నారు. మొత్తం 1,021 పోలింగ్ కేంద్రాలకు గానూ 286 పోలింగ్ కేంద్రాలు మారుమూల ప్రాంతాల్లో ఉండడంతో సెల్ సిగ్నల్స్ అందుబాటులో లేవని గుర్తించామని చెప్పారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన వివిధ రాజకీయ పార్టీల నేతలకు తాజా ఓటరు జాబితాలను పంపిణీ చేశారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల వివరాలను మరో మారు పరిశీలించి, సమస్యలుంటే తమకు తెలిపితే అనుబంధ ఓటరు జాబితాలో పొందుపరుస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో వైసీపీ నేత సీదరి మంగ్లన్నదొర, టీడీపీ నేత దప్పోడి వెంకటరమణ, బీజేపీ నేత కె.రాఘవేంద్రరావు, కాంగ్రెస్ నేత కె.బాలకృష్ణ, బీఎస్పీ నేత చిన్నయ్యదొర, ఆమ్‌ఆద్మీ పార్టీ నేత వంశీకృష్ణ, సీపీఎం నేత వీహెచ్.దాస్, తదితరులు పాల్గొన్నారు.


పాడేరులో దీక్షా శిబిరంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

అదరం.. బెదరం

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

సమ్మె విరమించి విధుల్లో చేరకుంటే తొలగిస్తామని వైసీపీ ప్రభుత్వం బెదిరించినా అంగన్‌వాడీలు ఏమాత్రం తగ్గలేదు. ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకోవాలనే లక్ష్యంతో తమ సమ్మెను కొనసాగిస్తున్నారు. చలో విజయవాడ కార్యక్రమానికి సైతం ఏజెన్సీ ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో అంగన్‌వాడీలు తరలివెళ్లారు. తమకు వైఎస్ జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలనే డిమాండ్‌పై సమ్మె చేపడుతున్న అంగన్‌వాడీలపై ప్రభుత్వం పలు రకాలుగా బెదిరింపులు, అరెస్టులకు పాల్పడడంపై వారంతా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విధుల్లో చేరని అంగన్‌వాడీలు

అంగన్‌వాడీల సమ్మె సోమవారానికి 42వ రోజుకు చేరింది. ఈ క్రమంలో అంగన్‌వాడీలు సోమవారం ఎట్టి పరిస్థితుల్లో విధుల్లో చేరాలని, లేకుంటే తొలగిస్తామని ప్రభుత్వం హెచ్చరించింది. అయినప్పటికీ అంగన్‌వాడీలు ఐక్యంగా ప్రభుత్వ చర్యలను తిప్పికొట్టారు. అంగన్‌వాడీలు విధుల్లో చేరకుండా సమ్మె శిబిరంలోనే తమ నిరసనను కొనసాగించారు. ఐటీడీఏ ముందు నిరసన శిబిరంలోనూ కూర్చుని తమ సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వ బెదిరింపులకు భయపడబోమని ప్రభుత్వానికి వ్యతిరేకంగా గట్టిగా నినాదాలు చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని, సమ్మె కాలానికి వేతనాలు చెల్లించాలని, ప్రభుత్వం ఇచ్చిన నోటీసులు, ఎస్మాను ఉపసంహరించాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు ఎల్.సుందరరావు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

విజయవాడ వెళుతున్న వాళ్లు మార్గమధ్యంలో అరెస్టు

అంగన్‌వాడీల సమస్యలపై సోమవారం తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి ఏజెన్సీ ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో అంగన్‌వాడీలు ఆదివారమే బయలుదేరి వెళ్లారు. అయితే అంగన్‌వాడీలు విజయవాడ చేరకుండానే మార్గమధ్యంలోనే ఎక్కడికక్కడ పోలీసులు వారిని అరెస్టు చేశారు. పాడేరు, పెదబయలు ప్రాంతానికి చెందిన అంగన్‌వాడీలను హనుమాన్ జంక్షన్‌లో అరెస్టు చేశారని అంగన్‌వాడీల సంఘం నేతలు తెలిపారు. ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలు విధించినా వెనక్కి తగ్గబోమని అంగన్‌వాడీలు అంటున్నారు.

ఫ్లాష్.. ఫ్లాష్.. అంగన్‌వాడీల సమ్మె విరమణ : మంత్రి బొత్స

అంగన్‌వాడీలు సమ్మె విరమించి మంగళవారం నుంచి విధులకు హాజరవుతారని మంత్రి బొత్స సత్యనారాయణ సోమవారం అర్ధరాత్రి 12 గంటల తరువాత ప్రకటించారు. అంగన్‌వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ సంఘం నేతలతో రాష్ట్ర ప్రభుత్వంతో జరిపిన చర్చలు సఫలం అయినట్టు ఆయన పేర్కొన్నారు.

4,149 మంది అంగన్‌వాడీల తొలగింపునకు రంగం సిద్ధం

ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి

ఆయా పోస్టుల భర్తీకి 24న నోటిఫికేషన్

పాడేరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించిన 4,149 మంది అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలను విధుల నుంచి తొలగించేందుకు రంగం సిద్ధమైందని ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి సోమవారం ... మిగతా 8వ పేజీలో



కనీస వసతులు లేని తూములోవ గ్రామం... పక్కన కలుషిత ఊటనీరు పట్టుకుంటున్న మహిళలు

తూములోవలో వసతులు శూన్యం

రహదారి, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు లేక జనం ఇక్కట్లు

పాఠశాల లేకపోవడంతో బాలలు నాలుగు కిలో మీటర్లు నడవాల్సిన దుస్థితి

పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

కొయ్యూరు, జనవరి 22: బూదరాళ్ల పంచాయతీ తూములోవ గ్రామం ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదు. కనీస వసతులు లేక ఆ గ్రామ ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తమ గ్రామాన్ని పట్టించుకోవడం లేదని వారు వాపోతు న్నారు.

కొయ్యూరుకు సుమారు 30 కిలో మీటర్ల దూరంలో తూములోవ గ్రామం ఉంది. ఈ గ్రామానికి విద్యుత్ సౌకర్యం లేదు. రహదారి, తాగునీటి వసతి లేదు. పాఠశాల లేకపోవడం తో నాలుగు కిలో మీటర్ల దూరంలో ఉన్న చీడిపల్లికి నడిచి వెళ్లి చదువుకోవలసిన దుస్థితి ఇక్కడి బాలలకు నెలకొంది. అత్యవసర వైద్య సేవల కోసం గ్రామస్థులను తరలించాలంటే డోలీ మోతలే దిక్కు. విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో చీకట్లోనే మగ్గుతున్నారు. తాగునీటి వసతి లేకపోవడంతో గ్రామానికి కిలో మీటరు దూరంలో ఉన్న రాతిమాను- బండరాయి మధ్య నుంచి వచ్చే ఊటనీరే వీరికి ఆధారమైంది. గ్రామంలో బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రం కూడా లేదు.

పౌష్టికాహారం కోసం చిన్నారులు, బాలింతలు, గర్భిణులు నాలుగు కిలో మీటర్ల దూరంలో గల కునుకూరు గ్రామానికి వెళ్లాల్సి వస్తోంది. ఇక గ్రామంలో బడి ఈడు పిల్లలు సుమారుగా 15 మంది వరకు ఉన్నా పాఠశాల లేకపోవడంతో వీరంతా చీడిపల్లికి నడిచి వెళ్లి చదువుకుంటున్నారు. వైద్య సేవలు కూడా సకాలంలో అందక ఈ గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారు. తమ గ్రామ సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఇదే పంచాయతీలోని చల్దిగెడ్డ, బి.కొత్తవీధి, సుద్దలపాలెం, బి.శింగవరం, పోతవరం, రాజులపాడు, దడవగొయ్యి, కిండంగి, కొర్రపాడు, కొత్తపల్లి గ్రామాల్లో కూడా కనీస సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.


అధ్వానంగా ఉన్న బూదరాళ్ల-తూములోవ ప్రధాన రహదారి


పాడేరు మండలం వంట్లమామిడిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జె.శ్యామలరావు, పక్కన కలెక్టర్ సుమిత్‌కుమార్

పోలింగ్ కేంద్రాల తనిఖీ

మన్యంలో ఓటరు జాబితాల జిల్లా పరిశీలకుడి పర్యటన

పాడేరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు పోలింగ్ కేంద్రాల్లోని ఓటరు జాబితాలను జిల్లా ఓటరు జాబితాల పరిశీలకుడు, రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యదర్శి జె.శ్యామలరావు సోమవారం తనిఖీ చేశారు. మండలంలో వంట్లమామిడి, వంతాడపల్లి, శ్రీకృష్ణాపురం పోలింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ చేసి, ఆయా పోలింగ్ కేంద్రాల్లో చేర్చిన కొత్త ఓటర్లు, తొలగింపులు, మార్పులు చేర్పులు చేపట్టిన వివరాలను శ్యామలరావు క్షుణ్ణంగా పరిశీలించారు. ఓటర్ల తొలగింపులో భాగంగా బూత్ స్థాయి అధికారులు చేపట్టిన ప్రక్రియను ఆయన పరిశీలించి, అందుకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు.

అనంతరం స్థానిక పీఎంఆర్‌సీ అతిథి గృహంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, స్థానిక తహసీల్దార్ వి.త్రినాధ రావునాయుడులతో సమావేశమై ఓటరు జాబితాపై జిల్లా పరిశీలకుడు శ్యామలరావు సమీక్ష నిర్వహించి సంతృప్తి వ్యక్తం చేశారు.


పాడేరు- జి.మాడుగుల మార్గంలో సోమవారం ఉదయం కమ్ముకున్న పొగమంచు

వీడని పొగమంచు

కొనసాగుతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు

జి.మాడుగులో 10.5, జీకేవీధిలో 11.6 డిగ్రీలు నమోదు

పాడేరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మన్యంలో పొగమంచు ప్రభావం కొనసాగుతున్నది. ఏజెన్సీలో సోమవారం తెల్లవారుజాము నుంచి ఉదయం పది గంటల వరకు పొగమంచు దట్టంగా అలుముకుంది. దీంతో ఎదురుగా వున్న వ్యక్తులు, వాహనాలు సైతం కనిపించని పరిస్థితి ఏర్పడడంతో వాహనాల హెడ్ లైట్లు వేసుకుని రాకపోకలు సాగించాల్సి వచ్చింది. పొగ మంచు సోయగంతో ఏజెన్సీలో మన్యం ప్రకృతి అందాలు మరింత సుందరంగా కనిపిస్తున్నాయి.

కొనసాగుతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు

ఏజెన్సీలో గత కొన్ని రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు కొనసాగున్నాయి. దీంతో చలి ప్రభావం సైతం కొనసాగుతున్నది. జి.మాడుగులలో 10.5, జీకేవీధిలో 11.6, చింతపల్లిలో


చింతపల్లిలో కురుస్తున్న మంచు

12.5, పాడేరు, అరకులోయలో 12.7, ముంచంగిపుట్టులో 13.5, పెదబయలు, హుకుంపేటలో 13.7 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత లు సోమవారం నమోదయ్యాయి. కనిష్ఠ ఉష్ణోగ్రతలు కొనసాగుతుండడంతో చలి తీవ్రత పెరుగుతున్నది. దీంతో మధ్యాహ్నం వేళల్లో ఒక మోస్తరుగా ఎండకాస్తూ మిలిగిన సమయాల్లో చలి ప్రభావం కొనసాగుతున్నది.

జీకే వీధి, చింతపల్లిలో..

చింతపల్లి: ఉత్తరాది నుంచి వీస్తున్న శీతల గాలుల ప్రభావం వల్ల ఏజెన్సీ వ్యాప్తంగా కనిష్ఠ ...మిగతా 8వ పేజీలో

విశాఖకు షర్మిల

రాహుల్ పాదయాత్రపై దాడిని ఖండిస్తూ నిరసన

రాహుల్ పాదయాత్రపై దాడికి రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ యాత్రపై అస్సోంలో బీజేపీ నాయకులు దాడికి పాల్పడ్డారంటూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సోమవారం రాత్రి విశాఖలో నిరసన చేపట్టారు. పీసీసీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారి నగరానికి వచ్చిన ఆమె ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్నారు. తొలుత గాంధీ విగ్రహానికి పూల దండ వేసి నివాళులర్పించిన అనంతరం ఆమె...పార్టీ నాయకులతో కలిసి నిరసన చేపట్టారు.

- వార్త మెయిన్‌లో..

జీవీఎంసీ ఎదురుగా ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎస్ షర్మిల



క్రైం... crime news

నేల బావిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కశింకోట, జనవరి 22 : కశింకోటలోని ఒక ప్రైవేటు లేఅవుట్‌లో ఉన్న నేలబావిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం తేలిందని సీఐ కె.వినోద్‌బాబు తెలిపారు. మృతుడు ఎరుపురంగు షర్టు, స్కట్ డ్రాయర్ ధరించి ఉన్నాడని చెప్పారు. కశింకోట-3 వీఆర్‌వో గొర్లి ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

బంగారం దుకాణాల్లో చోరీకి యత్నం

ఎలమంచిలి, జనవరి 22: పట్టణంలోని భవనం వీధిలో రెండు బంగారు దుకాణాల్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పట్టణ ఎస్ఐ పాపినాయుడు వెల్లడించిన సమాచారం ప్రకారం.. భవనం వీధిలో వున్న రెండు బంగారు దుకాణాల షట్టర్లు కొంతమేర ఎత్తి వుండడాన్ని సోమవారం ఉదయం ఆయా యజమానులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ గఫూర్‌తోపాటు క్లూస్ టీమ్ నిపుణులు, క్రైమ్ అధికారులు వచ్చి వివరాలు సేకరించారు. దుకాణాల్లో నగదు, బంగారం చోరీకి గురికాలేదని నిర్ధారించారు. యజమాని కుషాల్ వికాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.


చోరీ యత్నం జరిగిన బంగారం నగల దుకాణాన్ని పరిశీలిస్తున్న సీఐ గఫూర్

17 మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ, జనవరి 22: మండలంలో సోమవారం వేర్వేరుచోట్ల పోలీసులు దాడులు చేసి 17 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి సీఐ బాల సూర్యారావు అందించిన వివరాలిలా ఉన్నాయి. తానాం గ్రామంలో పైలా అప్పారావు అనే వ్యక్తి పాన్‌షాపు నిర్వహిస్తూ మద్యం అమ్మకాలు చేపడుతున్నాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు దాడులు చేసి తొమ్మిది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. షాపు యజమానిని అదుపులోకి తీసుకున్నారు. కలపాక పంచాయతీ పరిధి స్వయంభూవరం గ్రామానికి చెందిన బొండా గోవింద అనే వ్యక్తి పరవాడ సినిమాహాల్ జంక్షన్ వద్ద వున్న ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి ఎనిమిది మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి ఇంటి వద్ద విక్రయించేందుకు తీసుకువెళ్తున్నాడు. పోలీసులు అతన్ని అడ్డుకుని సోదా చేయగా మద్యం సీసాలు లభించాయి. ఇతనిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు.

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

» కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు

అచ్యుతాపురం రూరల్, జనవరి 22 : మండలంలోని వెదురువాడ సమీపంలో ఆర్టీసీ బస్సు, బైక్‌ను ఢీకొన్న సంఘటనలో కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. విశాఖలో సిటీలో పోలీసు కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న యర్రంశెట్టి రాము సోమవారం సాయంత్రం ఎలమంచిలి వైపు నుంచి అచ్యుతాపురం వైపు బైక్ వస్తున్నాడు. వెదురువాడ సమీపంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు బలంగా ఢీకొంది. దీంతో రాము తలకు, ముఖానికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు.

సెల్ టవర్‌లో మంటలు

» దగ్ధమైన బ్యాటరీలు, మంటలను అదుపులోకి తెచ్చిన ఫైర్ సిబ్బంది

పాయకరావుపేట, జనవరి 22 : సెల్ టవర్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు ఎగిసిపడడంతో సమీపంలోని నివాసితులు భయాందోళనకు గురయ్యారు. సూర్యమహల్ సెంటర్‌కి సమీపంలో ఉన్న పండరీపురం వీధిలో ఓ ప్రైవేటు టెలికం సంస్థ సెల్ టవర్ ఏర్పాటుచేసింది. సోమవారం సాయంత్రం సెల్ టవర్‌లో విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగా మంటలు ఎగిశాయి. సెల్ టవర్ కిందనున్న బ్యాటరీల నుంచి మంటల వస్తుండడంతో చుట్టుపక్కల ఇళ్లల్లో వుంటున్న వారు భయంతో పరుగులు తీశారు. సమాచారం అందుకున్న పాయకరావుపేట పోలీసులు, తుని ఫైర్ సిబ్బంది వచ్చి సుమారు గంటన్నర పాటు శ్రమించి మంటలను అదుపు చేశారు.


సెల్ టవర్ నుంచి ఎగిసిపడుతున్న మంటలు

ఆలిండియా పోలీసు కమాండో పోటీలు ప్రారంభం


బెలూన్లు ఎగురవేసి పోటీలను ప్రారంభిస్తున్న గ్రేహౌండ్స్ అడిషనల్ డీజీపీ రాజీవ్‌కుమార్ మీనా, విశాఖ సీపీ రవిశంకర్ అయ్యన్నార్ తదితరులు

» జాతీయ స్థాయిలో 23 జట్లు ప్రాతినిధ్యం
» పాల్గొన్న 800 మంది క్రీడాకారులు

విశాఖపట్నం, జనవరి 22 : దేశంలో ఉత్తమమైన కమాండోలు పాల్గొంటున్న ఈ పోటీలు ప్రపంచంలోనే అత్యుత్తమమైనవని నగర పోలీసు కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్ అన్నారు. సోమవారం ఆయన నగర శివారులోని కాపులుప్పాడ గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రంలో 14వ ఆల్ ఇండియా పోలీసు కమాండో పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన పోలీసు వృత్తిని గ్రేహౌండ్స్ విభాగంలో అసాల్ట్ కమాండర్‌గా ప్రారంభించానన్నారు. పోటీల్లో రాష్ట్రస్థాయి జట్లతో పాటు పారా మిలటరీ దళాలు నుంచి కమాండోస్ వరకూ పాల్గొంటున్నట్టు చెప్పారు. గ్రేహౌండ్స్ అడిషనల్ డీజీపీ రాజీవ్‌కుమార్ మీనా మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత ఈ పోటీలను ఏపీ పోలీసు శాఖ తరపున గ్రేహౌండ్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించడం ఇదే ప్రథమమన్నారు. ఈనెల 30 వరకూ పోటీలు జరుగుతాయని, ముగింపు కార్యక్రమానికి డీజీపీ కసిరెడ్డి వెంకట రాజేంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నట్టు తెలిపారు. పోటీల్లో జాతీయ స్థాయిలో 23 జట్లు ప్రాతినిధ్యం వహిస్తున్నాయని, వీటిలో 16 జట్లు రాష్ట్రస్థాయి కాగా, 7 ఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, పీఆర్పీఎఫ్, సీఐఎస్ఎఫ్, ఐటీబీటీ, ఎస్ఎస్పీ, అస్సాం రైఫిల్స్ జట్లు ఉన్నాయని వివరించారు. సుమారు 800 మంది కమాండోలు పాల్గొన్నారన్నారు. పోటీలు నేవిగేషన్, స్కిల్ టెస్ట్, ప్లానింగ్ అండ్ ప్రెజెంటేషన్, ఫిజికల్, ఫైరింగ్ విభాగాల్లో జరుగుతాయని తెలిపారు. కాగా తొలుత వివిధ రాష్ట్రాల కమాండోలు, పారా మిలిటరీ దళాల కమాండోలు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. పోటీలకు నిర్మించిన రెడ్ పోర్టువాల్‌ను ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో ఇన్‌కంటాక్స్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనరు రాజీవ్ కుమార్ సింగ్, పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ అతుల్ సింగ్, విశాఖ రేంజ్ ఐజీ హరికృష్ణ, గ్రేహౌండ్స్ డీఐజీ కొయ్య ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	90.00
లైవ్ ధర	110.00
విత్ స్కిన్	190.00
స్కిన్ లెస్	200.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	563
విజయనగరం	567
శ్రీకాకుళం	567

కదం తొక్కిన అంగన్‌వాడీలు

» అనకాపల్లిలో ర్యాలీ, నెహ్రూచౌక్‌లో మానవహారం, రాస్తారోకో
» ప్రభుత్వ తీరుపై మండిపడిన సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

అనకాపల్లి టౌన్, జనవరి 22: రాష్ట్ర ప్రభుత్వ నిర్బంధాన్ని నిరసిస్తూ అంగన్‌వాడీలు సోమవారం అనకాపల్లిలో కదం తొక్కారు. వివేకానందనగర్‌లోని సీఐటీయూ కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా నెహ్రూచౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఇక్కడ మానవహారంగా ఏర్పడి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ, 42 రోజుల నుంచి సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు, ప్రజల నుంచి సేకరించిన కోటి సంతకాల వినతిపత్రాలను ముఖ్యమంత్రి జగన్‌కు నివేదించడానికి శాంతియుతంగా విజయవాడ వెళుతున్నారని, కానీ ప్రభుత్వం పోలీసులతో వారిని నిర్బంధించి భయభ్రాంతాలకు గురి చేయడమేకాకుండా అరెస్టు చేయించడం దారుణమని అన్నారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం విషయంలో వైసీపీ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తున్నదన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు మాట్లాడుతూ, అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 24వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పక్షాలతో కలిసి ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గనిశెట్టి సత్యనారాయణ, ఐద్వా జిల్లా కార్యదర్శి డీడీ వరలక్ష్మి, కర్రి అప్పారావు, బి.ఉమామహేశ్వరరావు, గండి నాయనబాబు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రతినిధులు భవాని, ఆదిలక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.


అనకాపల్లి నెహ్రూచౌక్‌లో మానవహారంగా ఏర్పడిన అంగన్‌వాడీలు

అంగన్‌వాడీల ఆందోళన ఉధృతం

» ప్రభుత్వ తీరుకు నిరసనగా ప్రధాన రహదారిపై బైఠాయింపు

చోడవరం, జనవరి 22: తమ సమస్యలు పరిష్కరించకుండా విధులకు హాజరుకాకుంటే తొలగిస్తామని రాష్ట్ర ప్రభుత్వం బెదిరింపులకు దిగడాన్ని నిరసిస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం పట్టణంలోని ప్రధాన రహదారిపై సోమవారం బైఠాయించి ఆందోళన చేశారు. సీఐటీయూ నాయకురాలు గూనూరు వరలక్ష్మి ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. నిరంకుశ ముఖ్యమంత్రి జగన్ డౌన్ డౌన్ అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళనతో రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. సీఐ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్ఐ అప్పలనాయుడు, సిబ్బంది ఆందోళన చేస్తున్న కొందరు అంగన్‌వాడీ కార్యకర్తలను బలవంతంగా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో ఇతర అంగన్‌వాడీ కార్యకర్తలు సైతం పోలీస్ స్టేషన్‌కు చేరుకుని సాయంత్రం వరకూ ఆందోళన చేశారు.


చోడవరంలో ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలను పోలీస్ స్టేషన్‌కు తరలించేందుకు ప్రయత్నిస్తున్న పోలీసులు

నేతల నిర్బంధం

విజయవాడలో అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళన నేపథ్యంలో ఆదివారం రాత్రి నుంచి సీఐటీయూ నేతలు, అంగన్‌వాడీ సంఘాల నాయకులను పోలీసులు ముందస్తుగా నిర్బంధించారు. సోమవారం ఉదయం అంగన్‌వాడీ కార్యకర్తల దీక్షా శిబిరం వద్ద కూడా పోలీసులు మోహరించి వారు ఎటూ వెళ్లకుండా బందోబస్తు నిర్వహించారు.

అర్జీలను త్వరగా పరిష్కరించాలి

» స్పందనలో అధికారులకు కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి ఆదేశం

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 22: స్పందన అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఆయన మాట్లాడుతూ, వివిధ సమస్యలపై ప్రజలు అందించే వినతి పత్రాలు, ఫిర్యాదులను నిశితంగా పరిశీలించి త్వరితగతిన క్లియర్ చేయాలని చెప్పారు. స్పందనలో ప్రధానంగా భూసమస్యలు, రేషన్‌కార్డుల మంజూరుకు సంబంధించి అర్జీలు అధికంగా వస్తున్నాయని, సంబంధిత అధికారులు వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ నెల 25వ తేదీన జాతీయ ఓటరు దినోత్సవాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. 26న నిర్వహించే గణతంత్ర దినోత్సవానికి తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. కాగా స్పందన కార్యక్రమంలో వివిధ సమస్యలకు సంబంధించి 213 అర్జీలు అందాయి. వీటిని పరిష్కారం నిమిత్తం సంబంధిత శాఖలకు బదలాయించారు.


అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

జిల్లా పోలీస్ కార్యాలయంలో..

అనకాపల్లిరూరల్, జనవరి 22: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎస్పీ కేవీ మురళీకృష్ణ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వారితో స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అర్జీలను సంబంధిత అధికారులకు బదలాయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, స్పందన అర్జీలను త్వరగా పరిష్కరించి, ఫిర్యాదులపై తీసుకున్న చర్యల గురించి నిర్ణీత గడువులోగా నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. మొత్తం 26 అర్జీలు అందగా.. వీటిలో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, మోసాలు వంటివి అధికంగా వున్నాయి. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సత్యనారాయణ, ఎస్ఐ సావిత్రి పాల్గొన్నారు.

మూడు నెలల్లో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయం

» మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

నాతవరం, జనవరి 22: మూడు నెలల్లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రానున్నదని, నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కానున్నారని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. సోమవారం నాతవరం మండలం ఏపీపురం పంచాయతీ ఉప్పరగూడెం గ్రామంలో ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ వైసీపీ నాలుగున్నర ఏళ్ల పాలనలో అన్నివర్గాల ప్రజలు విసుగుచెంది ఉన్నారన్నారు. మేధావులు, ప్రజలు మౌనం వహిస్తే దుర్మార్గులు రాజ్యమేలుతారని పెద్దలు చెబుతుండేవారని, ఇప్పుడు అదే నిజమని తెలిసిందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఏవో సాకులు చూపించి నాలుగు లక్షల మంది పింఛన్లు రద్దు చేశారని పేర్కొన్నారు. ఎనిమిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచి సామాన్యుల నడ్డి విరిచారని ఆయన విమర్శించారు. ఏపీపురం ఎంపీటీసీ సభ్యుడు లోవరాజు మాట్లాడుతూ పంచాయతీ నిధులను సీఎం జగన్ దారి మళ్లించడంతో సర్పంచులు ఉత్సవ విగ్రహాలుగా మిగిలారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు కరక సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, నర్సీపట్నం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లాలం అచ్చిరాజు, మాజీ ఎంపీపీ ఎస్.విజయ్‌కుమార్, తాండవ ప్రాజెక్టు మాజీ చైర్మన్ కొండబాబు, సర్పంచ్ పైల రమేశ్, తదితరులు పాల్గొన్నారు.


ఉప్పరగూడెంలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు

శ్రీరామునికి 108 కిలోల లడ్డూ ప్రసాదం


ఊరేగింపుగా వెళుతున్న కాలనీవాసులు

మాడుగుల రూరల్, జనవరి 22: అయోధ్యలో బాల రాముని ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని సోమవారం మండలంలోని పలు గ్రామాలు జైశ్రీరామ్ నామస్మరణతో మార్మోగాయి. మాడుగులలో హైస్కూల్, అర్బన్ కాలనీ వాసులు 108 కిలోల లడ్డూ ప్రసాదాన్ని తయారు చేయించి రిక్షాపై సీతారామ లక్ష్మణ సమేత ఫ్లెక్సీని పెట్టి లడ్డూ ప్రసాదాన్ని ఊరేగించి సీతారామాలయంలో సమర్పించారు. రామాలయాల వద్ద భక్తులు భజనలు చేశారు.


కాలనీవాసులు తయారు చేసిన 108 కిలోల లడ్డూ ప్రసాదం

వానరం భక్తి

బుచ్చెయ్యపేట, జనవరి 22: అయోధ్య రామాలయంలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం జరుగుతున్న వేళ మండలం కొండపాలెంలోని ఓ ఇంటిపై ఎగురవేసిన శ్రీరామ జెండాను వానరం పట్టుకోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. సోమవారం ఓ వానరం ఆ ఇంటిపై ఎగురుతున్న జెండాను పట్టుకుని చాలా సేపు కూర్చొంది. దీనిని చూసి అందరూ జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు.


కొండపాలెంలో శ్రీరామ జెండాను పట్టుకున్న వానరం

విద్యుత్ చార్జీలపై 29 నుంచి ఏపీఈఆర్‌సీ ప్రజాభిప్రాయ సేకరణ

విశాఖపట్నం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో అమలు చేయనున్న విద్యుత్ చార్జీలపై ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ఈ నెల 29 నుంచి వర్చువల్ విధానంలో ప్రజాభిప్రాయ సేకరణ చేయనుందని ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ సోమవారం తెలిపారు. ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ వి.నాగార్జునరెడ్డి నేతృత్వంలో నాలుగు రోజులు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణలో ఈఆర్‌సీ సభ్యులు ఠాకూర్‌సింగ్, పీవీఆర్ రెడ్డి పాల్గొంటారు. విశాఖపట్నంలోని ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో వరుసగా నాలుగు రోజులు ప్రతిరోజు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు అభిప్రాయాలు తెలుసుకుంటారు. విద్యుత్ సంస్థలు సమర్పించిన వార్షిక ఆదాయం అవసరాల అంచనాలపై అభిప్రాయాలు స్వీకరిస్తారు. విద్యుత్ పంపిణీ సంస్థల అధికారులతో పాటు ట్రాన్స్‌కో, జెన్‌కో అధికారులు పాల్గొంటారు. అభిప్రాయాలు తెలియజేయాలనుకునేవారు ఆయా జిల్లాల్లోని సమీప విద్యుత్ ఆపరేషన్ సర్కిల్ కార్యాలయం లేదా డివిజన్ కార్యాలయానికి వెళ్లి ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని సీఎండీ పృథ్వీతేజ్ సూచించారు. ప్రజలంతా వీక్షించేలా ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం చేస్తామన్నారు.

మూడు గ్రామాల రైతుల ఆందోళన

» ల్యాండ్ పూలింగ్ ఆర్‌సీ ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని డిమాండ్

సబ్బవరం, జనవరి 22 : మండలంలోని పైడివాడ, పైడివాడ అగ్రహారం, ఎరుకునాయుడుపాలెం గ్రామాల్లో ల్యాండ్ పూలింగ్ కింద సేకరించిన భూములకు సంబంధించి ప్రభుత్వం తమకు పరిహారంగా ఇవ్వాల్సిన రీ కానిస్టిట్యూట్ (ఆర్‌సీ) ప్లాట్లు తక్షణమే రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం అనకాపల్లి కలెక్టరేట్ ముందు మూడు గ్రామాల రైతులు ఆందోళన చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు అక్కిరెడ్డి దుర్గినాయుడు, బొబ్బరి కన్నారావు, గొంతిన పైడిరాజు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగేళ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలు కింద పేదలందరికీ ఇళ్ల పథకంలో పట్టణ పేదలకు ఇళ్ల స్థలాలు(సెంటు స్థలం) కోసం మూడు గ్రామాలకు చెందిన సుమారు 150 మంది రైతుల డీపట్టా, ఆక్రమణలో ఉన్న 320 ఎకరాలు సమీకరించిందన్నారు. ఆ సమయంలో గ్రామాల్లో పలు మార్లు అప్పటి రెవెన్యూ అధికారులు గ్రామ సభలు పెట్టి ఆక్రమణకు 450 గజాలు, డీ పట్టాకు 900 గజాలు రైతులకు పరిహారం కింద ఆర్‌సీ ప్లాట్లు ఇస్తామని చెప్పారన్నారు. ప్రతి రైతుకు సంబంధించిన ఆర్‌సీ ప్లాట్లు అన్ని విధాలుగా కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసి ఇస్తామని చెప్పారన్నారు. అయితే ఇది గడిచి నాలుగేళ్లు అవుతున్నా ఇప్పటి వరకూ ప్లాట్లు ఎటువంటి అభివృద్ధి చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు అక్కిరెడ్డి అప్పారావు, కోన సత్యనారాయణ, ఎం.అప్పలరాజు తదితరులతో పాటు వందమంది రైతులు పాల్గొన్నారు.


అనకాపల్లి కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

కేంద్ర మంత్రి మురళీధరన్ సబ్బవరం రాక రేపు

సబ్బవరం, జనవరి 22: కేంద్ర విదేశాంగ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి వి.మురళీధరన్ ఈ నెల 24వ తేదీన సబ్బవరం రానున్నట్టు ఎంపీడీవో రమేశ్‌నాయుడు తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో పాల్గొని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 18 రకాల పథకాల గురించి ప్రజలకు వివరిస్తారని చెప్పారు.

వచ్చే నెలలో కొత్త రైల్వే జోన్‌కు భూమి పూజ: ఎంపీ సత్యవతి

అనకాపల్లి టౌన్, జనవరి 22: విశాఖ రైల్వే జోన్ పనులకు ఫిబ్రవరి మొదటి వారంలో భూమి పూజ జరగనుందని అనకాపల్లి ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి చెప్పారు. సోమవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, విశాఖ కేంద్రంగా ఏర్పాటయ్యే దక్షిణ కోస్తా (సౌత్ కోస్ట్) రైల్వేజోన్‌కు కేంద్ర ప్రభుత్వం రూ.170 కోట్లు ఖర్చు చేయనున్నదని చెప్పారు. శంకుస్థాపన పనుల కోసం రూ.10 కోట్లు విడుదల చేసిందని ఆమె వెల్లడించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయొద్దంటూ ముఖ్యమంత్రి కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారని, ఎంపీలు కూడా పార్లమెంట్‌లో ప్రధానిని కలిసి వినతి పత్రం ఇచ్చామని ఆమె చెప్పారు.


విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ

అనకాపల్లిలో ఎస్పీ పర్యటన

అనకాపల్లి టౌన్, జనవరి 22: జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదివారం రాత్రి అనకాపల్లిలో పర్యటించారు. అంగన్‌వాడీలు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పాల్గొనడానికి విజయవాడ వెళుతున్న విషయాన్ని తెలుసుకున్న ఆయన అధికారులను అప్రమత్తం చేయడంతో పాటు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి పర్యవేక్షించారు. అంగన్‌వాడీలు ఎవరూ విజయవాడ వెళ్లకుండా కట్టడి చేయడాలని కిందిస్థాయి పోలీస్ అధికారులను ఆయన ఆదేశించారు.


ఆదివారం రాత్రి బైపాస్ జంక్షన్‌లో పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో అనకాపల్లి క్రీడాకారులకు పతకాలు

అనకాపల్లి టౌన్, జనవరి 22: గుంటూరు జిల్లా తెనాలిలో మూడు రోజుల పాటు జరిగిన సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ వివిధ విభాగాల పోటీల్లో అనకాపల్లికి చెందిన క్రీడాకారులు పలు పతకాలు సాధించారు. పురుషుల 83 కిలోల జూనియర్ విభాగంలో ఆళ్ల సతీశ్ కాంస్య పతకం, 93 కిలోల సీనియర్స్ విభాగంలో కె.నరేంద్ర కాంస్య పతకం, బాలికల 76 కిలోల సీనియర్స్ విభాగంలో కె.ప్రవల్లిక రజత పతకం పొందారు. వీరిని పవర్ లిఫ్టింగ్ జిల్లా అసోసియేషన్ ప్రధానకార్యదర్శి బి.బద్రినాథ్, చైర్మన్ కాండ్రేగుల శ్రీరామ్, గౌరవాధ్యక్షుడు కె.అప్పలనాయుడు, అధ్యక్షుడు నీలా అభినందించారు.


పతకాల విజేతలతో పవర్ లిఫ్టింగ్ జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు

కాండం నుంచి అరటి గెల

కృష్ణాదేవిపేట, జనవరి 22: గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట గ్రామంలో దిమిలి రమణ ఇంటి పెరట్లో ఒక అరటి చెట్టు కాండం నుంచి అరటి గెల వచ్చింది. దీంతో ఈ వింత చూసేందుకు స్థానికులు ఎగబడ్డారు. దానిని సెల్ కెమెరాల్లో బంధించారు. అరటి గెల కాండంలో రావడం ఈ ప్రాంతంలో ఇదే మొదటిసారి అని పలువురు తెలిపారు.


కాండం నుంచి వచ్చిన అరటి గెల

జీవీఎంసీలో భారీగా బదిలీలు?

» మూడేళ్లకుపైబడి ఉన్నవారికి స్థాన చలనం
» ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రభావం

విశాఖపట్నం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న పలువురు అధికారుల బదిలీకి రంగం సిద్ధమైంది. ఒకేచోట మూడేళ్లకుపైగా పనిచేస్తున్న వారిని ఇతర జిల్లాలకు బదిలీ చేయాలంటూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీచేసిన విషయం తెలిసిందే. జీవీఎంసీ జోన్-3 కమిషనర్ విజయలక్ష్మి, జోన్-5 కమిషనర్ ఆర్‌వీఎస్ కృష్ణ మినహా మిగిలిన ఆరుగురు జోనల్ కమిషనర్లు మూడేళ్లకు మించి జీవీఎంసీలో పనిచేస్తున్నారు. ఇప్పుడు వారంతా బదిలీ కావాల్సి ఉంటుంది. అలాగే టౌన్‌ప్లానింగ్ విభాగంలో సిటీ ప్లానర్‌గా పనిచేస్తున్న దొరతోపాటు ఇద్దరు డీసీపీలు ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లడం ఖాయంగా కనిపిస్తోంది. అదేవిధంగా ఇంజనీరింగ్ విభాగంలో ఇద్దరు సూపరింటెంటెండెంట్ ఇంజనీర్లకు కూడా బదిలీ కావాల్సి ఉంటుంది. యూసీడీ విభాగంలో డీపీఓలుగా పనిచేస్తున్న ఇద్దరు అధికారులు కూడా మూడేళ్లకుపైగా పనిచేస్తుండడంతో వారికి కూడా బదిలీ తప్పదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. బదిలీలపై ఇప్పటికే కసరత్తు పూర్తయిందని, ఒకటి, రెండు రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.



భద్రతా మాసోత్సవ ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఆర్‌టీవో

భద్రతా మాసోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

పాడేరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే రహదారి భద్రతా మాసోత్సవాల పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. గతంలో భద్రతా వారోత్సవాలు నిర్వహించే వారని, ప్రజలకు భద్రతపై మరింత చైతన్యం కల్పించేందుకు ఈ ఏడాది మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టీవో లీలాప్రసాద్, వెహికల్ ఇన్‌స్పెక్టర్ వాసు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి వైసీపీ నేత గంగాధర్‌స్వామి



పీసీసీ అధ్యక్షురాలు షర్మిలతో గంగాధర్‌స్వామి

అరకులోయ, జనవరి 22: వైసీపీ సీనియర్ నేత శెట్టి గంగాధర్‌స్వామి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఏపీ పీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ షర్మిలారెడ్డి సమక్షంలో ఆదివారం ఆయన కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వైసీపీలో కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు లేదని, బయట నుంచి వచ్చిన వారికి పెద్దపీట వేస్తున్నారని ఈ సందర్భంగా గంగాధర్‌స్వామి చెప్పారు. అలాగే స్థానికేతరులకు అసెంబ్లీ టిక్కెట్లు ఇవ్వడం నచ్చక వైసీపీని వీడినట్టు ఆయన తెలిపారు. షర్మిలారెడ్డిపై నమ్మకం, రాజశేఖరరెడ్డిపై అభిమానంతో కాంగ్రెస్ పార్టీలో చేరానని, తనకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానని చెప్పారు.

కొత్త ఓటరు జాబితాలు సిద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ నాగమ్మ, పక్కన అధికారులు

డుంబ్రిగుడ, జనవరి 22: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎన్నికల కమిషన్ మండలంలో ఓటరు చేర్పులు, మార్పులు చేసి నూతన జాబితాలను విడుదల చేసినట్టు తహసీల్దార్ నాగమ్మ తెలిపారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో నూతన ఓటరు జాబితాలను బీఎల్‌వోలకు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా గతంలో 36,221 మంది ఓటర్లు ఉండగా. ఈ ఏడాదిలో నిర్వహించిన చేర్పులు, మార్పుల్లో 37,981 మందికి చేరినట్టు చెప్పారు. వీరిలో పురుషులు 18,468 మంది, మహిళలు 19,512 మంది, ట్రాన్స్‌జెండర్ ఒకరు ఉన్నారని ఆమె తెలిపారు. మండల వ్యాప్తంగా 18 పంచాయతీల్లోని 48 పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో ఆర్ఐ హరికృష్ణ, సీనియర్ అసిస్టెంట్ కామరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

చింతపల్లిలో 4,364 మంది కొత్త ఓటర్లు

చింతపల్లి, జనవరి 22: మండలంలో కొత్తగా 4,364 కొత్త ఓట్లు జాబితాలో చేర్చడం జరిగిందని ఉప తహసీల్దార్ గిడ్డి రాజ్‌కుమార్ తెలిపారు. సోమవారం తుది ఓటరు జాబితాను రెవెన్యూ అధికారులు విడుల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 63,130 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వారిలోపురుషులు 30183, స్త్రీలు 32944, ట్రాన్స్‌జెండర్లు ముగ్గురు ఉన్నారన్నారు. మండలంలో పద్దెనిమిదేళ్లు నిండిన 4,364 మందిని కొత్తగా చేర్చడం జరిగిందన్నారు. డబుల్ ఎంట్రీలు, మృతులు, వలస వెళ్లిపోయిన 1,344 మంది ఓటర్లను తొలగించామని వివరించారు.

కొయ్యూరులో కొత్త ఓటర్లు 2,154 మంది..

కొయ్యూరు: గత సార్వత్రిక ఎన్నికలతో పోల్చుకుంటే మండలంలో కొత్త ఓటర్లు 2,154 మంది పెరిగినట్టు తహసీల్దారు తిరుమలరావు తెలిపారు. మండలంలో తుది ఓటరు జాబితాను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికలకు మండలంలో 41024 మంది ఓటు హక్కు కలిగి ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 43178కు పెరిగిందన్నారు. దీంతో మహిళ ఓటర్లు 22590 కాగా, పురుష ఓటర్లు 20588 మంది ఉన్నారన్నారు. గత ఎన్నికల ఓటరు జాబితా నుంచి మరణించినవారు 1547 మందిని తొలగించగా, ఫారం 6, 7లతో 4394 మందిని జాబితాలో చేర్చినట్టు చెప్పారు. మిగిలిన 693 ఓట్లు డబుల్ ఎంట్రీగా గుర్తించి తొలగించామని తహసీల్దారు వివరించారు.

గూడెంకొత్తవీధిలో మొత్త ఓటర్లు 50,885

గూడెంకొత్తవీధి, జనవరి 22: మండలంలో 50,885 మంది ఓటర్లతో తుది జాబితా విడుదల చేసినట్టు తహసీల్దార్ ఎస్ఎల్‌వీ ప్రసాద్ తెలిపారు. మండలంలోని మొత్తం 56 పోలింగ్ బూత్‌ల పరిధిలోనున్న ఓటర్ల జాబితాను సోమవారం రెవెన్యూ అధికారులు విడుదల చేశారు. ఈ జాబితా ఆధారంగా మండలంలో పురుషులు 25,188 మంది, స్త్రీలు 25,695 మంది, ఇద్దరు థర్డ్ జెండర్ ఉన్నారని తహసీల్దార్ తెలిపారు.

ఓటు వినియోగంపై అవగాహన అవసరం

హుకుంపేట, జనవరి 22: ఓటు వినియోగంపై అర్హులైన వ్యక్తులకు అవగాహన అవసరమని తహసీల్దార్ రాజ్యలక్ష్మి స్పష్టం చేశారు. తన కార్యాలయంలో సోమవారం వీఆర్వోలు, బీఎల్‌వోలు, ఎన్నికల్ సెక్టార్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. మండల వ్యాప్తంగా గతంలో 43,877 ఓట్లు ఉండగా, ప్రస్తుతం 45,063 మందికి చేరినట్టు చెప్పారు. వారిని ఓటు వినియోగంపై చైతన్యపరచాలని సూచించారు. ఈ సమావేశంలో ఇంజనీరింగ్ అధికారులు రమేష్, సంజీవరావు, ఆర్ఐలు పాల్గొన్నారు.

వీడని పొగమంచు

... 5వ పేజీ తరువాయి

ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సోమవారం జీకేవీధిలో 11.6, చింతపల్లిలో 12.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్టు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్ తెలిపారు. నెలాఖరు వరకు గిరిజన ప్రాంతంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని శాస్త్రవేత్తలు తెలిపారు. ప్రస్తుతం చలితో పాటు గిరిజన గ్రామాల్లో మంచు దట్టంగా కురుస్తున్నది. లంబసింగి, చింతపల్లి, తాజంగి, జీకేవీధి, ఆర్‌వీనగర్ ప్రాంతాల్లో ఉదయం పది గంటల వరకు మంచు వీడడం లేదు. దీంతో ఈ ప్రాంత ప్రజలు చలి, మంచు వల్ల తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఉద్యోగులు, విద్యార్థులు, వ్యవసాయ కూలీలు, రైతులు ఉదయం వారి గమ్యస్థానాలకు చేరుకునేందుకు అవస్థలు పడుతున్నారు. రాత్రి, ఉదయం వేళల్లో ప్రయాణించే వాహన చోదకులు సైతం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

4,149 మంది అంగన్‌వాడీల తొలగింపునకు రంగం సిద్ధం

... 5వ పేజీ తరువాయి

రాత్రి తెలిపారు. గత 40 రోజులుగా అంగన్‌వాడీలు విధులకు గైర్హాజరై సమ్మె చేపడుతున్నారని, సమ్మెను విరమించి విధుల్లో చేరాలని పలుమార్లు సూచించామన్నారు. దీంతో తొలుత 357 మంది ఇటీవల విధుల్లో చేరారని, సోమవారం నాటికి విధుల్లో చేరని వారిని తొలగిస్తామని ప్రకటించడంతో మరో 415 మంది సోమవారం విధుల్లో చేరారన్నారు. అయినప్పటికీ సోమవారం రాత్రి తొమ్మిది గంటల వరకు ఇంకా మిగిలిన 4,149 మంది విధుల్లో చేరతారని చూశామని, అయినప్పటికీ విధుల్లో చేరలేదన్నారు. దీంతో వారందర్నీ విధుల్లోంచి తొలగించేందుకు రంగం సిద్ధం చేస్తున్నామని, మంగళవారం ఆయా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు తొలగింపు ఉత్తర్వులను జారీ చేస్తామని పీడీ తెలిపారు.

తొలగించిన పోస్టుల భర్తీకి 24న నోటిఫికేషన్

ప్రభుత్వ నిబంధనలు పాటించని కారణంగా తొలగించాలని భావిస్తున్న 4,149 మంది అంగన్‌వాడీల స్థానంలో ఇతరులను నియమించేందుకు ఈ నెల 24న కలెక్టర్ ఆధ్వర్యంలో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేస్తారని ఐసీడీఎస్ పీడీ పేర్కొన్నారు.

ఏ పల్లెలోనూ అభివృద్ధి జాడ లేదు

- ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పనితీరుకు ఇదే నిదర్శనం
- చంద్రబాబుపై స్థాయి మరచి విమర్శలు సరికాదు
- టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గిడ్డి ఈశ్వరి

పాడేరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఏ పల్లెలోనూ అభివృద్ధి జాడ కనిపించడం లేదని, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పనితీరుకు ఇదే నిదర్శనమని టీడీపీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. ఎమ్మెల్యే పనితీరు బాగులేని కారణంగానే అసెంబ్లీ సీటు ఇవ్వలేదని పేర్కొన్నారు. సోమవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గిడ్డి ఈశ్వరి మాట్లాడారు. అరకులో రా..కదలిరా సభలో చంద్రబాబునాయుడు ప్రసంగించిన విషయాలను తప్పుబడుతూ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి చరిత్ర తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. జీవో నంబర్-3, ఏజెన్సీలో కాఫీ ప్రాజెక్టు, ట్రైకార్ ద్వారా గిరిజనులకు రాయితీ పథకాలు అందించిన ఘతన టీడీపీ ప్రభుత్వమేనన్నారు. వైసీపీ పాలనలో గిరిజనాభివృద్ధి జరగలేదని, గడపగడపకు కార్యాక్రమాల్లో ఎమ్మెల్యేను ప్రజలు నిలదీసిన వైనాలు అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. అలాగే భాగ్యలక్ష్మి పనితీరు సైతం బాగాలేని కారణంగానే అసెంబ్లీ సీటు ఇవ్వలేదని ఈశ్వరి ఎద్దేశా చేశారు. వైసీపీ ప్రభుత్వం ట్రైకార్ పథకాన్ని పూర్తిగా ఎత్తేసి కేవలం చైర్‌ను మాత్రమే వుంచారన్నారు. ఏజెన్సీలో రోడ్లు, డ్రైన్లు, కుళాయిలు, సెల్ టవర్లు నిర్మించిన ఘనత టీడీపీదేనన్నారు. వాస్తవాలు తెలుసుకుని ఎమ్మెల్యే మాట్లాడాలని, తెలుగుదేశం ప్రభుత్వం కాఫీని అభివృద్ధి చేస్తే, వైసీపీ ప్రభుత్వం కాఫీ రైతులకు గిట్టుబాటు ధరల కల్పించలేదని, ఒక్క ఎకరం కాఫీ తోటను అదనంగా పెంచలేదని చెప్పారు. రా.. కదలిరా సభను విజయవంతం చేసిన పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలకు గిడ్డి ఈశ్వరి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కె.వెంకటసురేశ్‌కుమార్, శోభన్, బుజ్జి పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా పనిచేద్దాం..

- టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి దొన్నుదొర



టీడీపీలో చేరిన వైసీపీ, సీపీఎం కార్యకర్తలకు కండవాలు వేస్తున్న దొన్నుదొర

అరకులోయ, జనవరి 22: పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేద్దామని టీడీపీ అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర పేర్కొన్నారు. అరకు, అనంతగిరి మండలాలకు చెందిన పలువురు వైసీపీ, సీపీఎం నాయకులు సోమవారం టీడీపీలో చేరారు. వారికి దొన్నుదొర పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. అలాగే పార్టీ అధినేతలను ఎవరైనా దూషిస్తే ఉపేక్షించవద్దని, తగిన రీతిలో సమాధానం చెప్పాలని సూచించారు. పార్టీలో ఉంటూ కొంత మంది నేతలు ఇష్టానుసారంగా మాట్లాడడం సరికాదన్నారు. జనసేన-తెదేపా ప్రభుత్వం ఏర్పాటు కోసం క్రమశిక్షణతో కష్టపడి పనిచేద్దామన్నారు. కాగా, అనంతగిరి మండలంలోని వైసీపీకి చెందిన కొత్తూరు సర్పంచ్ సారా సీతయ్య, కాశీపట్నం ఉప సర్పంచ్ రాంబాబు, కొత్తూరు వార్డు సభ్యులు సారా పైడితల్లి, కొట్యాడ కిశోర్, నరవ అప్పలస్వామి, సారా చంద్రయ్య, అరకులోయ మండలంలోని సుంకరమెట్ట పంచాయతీ పరిధిలో నిమ్మగెడ్డ గ్రామానికి చెందిన 11 మంది సీపీఎం కార్యకర్తలు టీడీపీలో చేరగా, వారికి దొన్నుదొర కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం లంగుపర్తి, పెద్దబిడ్డ, గుమ్మ, ఎగువశోభ, పెదకోట, పైనంపాడు, కొత్తూరు పంచాయతీల సర్పంచులు, మాజీ సర్పంచులు, ముఖ్య నేతలు దొన్నుదొరను సత్కరించారు. వచ్చే ఎన్నికల్లో దొన్నుదొర గెలుపు కోసం సైనికుల్లా పనిచేస్తామని వారంతా పేర్కొనారు. పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసుబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు ఎల్‌బి.బీమరాజు, ఉపేంద్ర, కొమ్ములునాయుడు, లకోయి మహదేవ్, బొరిబొరి లక్ష్మి, నీరజ, చందా విజయనిర్మల, కుమార్, నాగరాజు, దామోదర్, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.



పాడేరు రామాలయంలో పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు, భక్తులు



హుకుంపేటలో సీతారాములకు పూజలు



చింతపల్లి ప్రధాన రహదారిపై ర్యాలీ చేస్తున్న రామ భక్తులు, విద్యార్థులు

రామనామ సంకీర్తనతో మార్మోగిన పల్లెలు



రాజేంద్రపాలెం రామాలయంలో రామనామ భజన చేస్తున్న భక్తులు

పాడేరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ నేపథ్యంలో జిల్లాలోని పల్లెల్లో రామనామ సంకీర్తనలతో మార్మోగాయి. అలాగే అన్ని రామాలయాల్లోనూ ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అలాగే రామ భక్తులు ర్యాలీలు చేశారు. జిల్లా కేంద్రం పాడేరులోని సుండ్రుపుట్టు, మండలంలోని కిండంగిలో రామాలయాల్లో సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. సుండ్రుపుట్టులో బీజేపీ నేతలు కురసా పార్వతమ్మ, కూడా కృష్ణారావు, పాంగి శ్రీలక్ష్మి, పి.మత్స్యకొండబాబు పాల్గొనగా, కిండంగిలో టీడీపీ నేతలు బొర్రా నాగరాజు, విజయరాణి, అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

చింతపల్లిలో ర్యాలీ, అన్నసమారాధన

చింతపల్లి: మండల కేంద్రంలో అయోధ్య ప్రాణ ప్రతిష్ఠకు మద్దతుగా హిందూ భక్తులు ర్యాలీ చేపట్టారు. సోమవారం ఉదయం పది గంటలకు రామాలయం నుంచి హనుమాన్ జంక్షన, సంత బయలు వరకు జైశ్రీరాం అంటూ నినాదాలు చేస్తూ మహిళలు, స్థానిక ప్రజలు ర్యాలీ చేశారు. అనంతరం రామాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా వర్తక సంఘం ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు మాట్లాడుతూ అయోధ్యలో శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠ జరగడం చాలా శుభపరిణామన్నారు. దేశ ప్రజల శ్రేయస్సు, శాంతి కోసం ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. మధ్యాహ్నం రామాలయం వద్ద భక్తులకు భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. రాత్రి రామాలయంలో ప్రత్యేక దీపారాధన చేశారు. ఈ కార్యక్రమంలో ఏటీడబ్ల్యూవో పసుపులేటి వినాయకరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రమణమూర్తి, వర్తక సంఘం నాయకుడు బంగారయ్య శెట్టి, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు పద్మకుమారి, మహిళలు పాల్గొన్నారు.

కొయ్యూరులో...

కొయ్యూరు: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని మండల వ్యాప్తంగా రామాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కొయ్యూరు, మంప, రావణాపల్లి, తోటలూరు, లూసం, రాజేంద్రపాలెం, చింతలపూడి, రేవళ్ల తదితర గ్రామాలలో భక్తులు శ్రీరామునికి పూజలతో పాటు భజనలు చేశారు. అలాగే రామనామ సంకీర్తనలు నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు, గిరిజన పూజారులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

హుకుంపేటలో...

హుకుంపేట: మండల కేంద్రంలోని రామాలయంలో సోమవారం సీతారాములకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు దిపారాధన చేశారు. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సీతారాముల ఆశీర్వాదం కోసం పూజలు, అభిషేకాలు చేశారు.

సీలేరు, ధారకొండ రామాలయాల్లో...

సీలేరు: గూడెంకత్తవీధి మండలంలోని సీలేరు, ధారకొండ రామాలయాల్లో సోమవారం తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే తెల్లవారుజామున రామనామ భజనలతో నగరసంకీర్తన చేశారు. ఉదయం నుంచి నిర్వహిస్తున్న ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్ఠ ముగిసిన తరువాత సీలేరు రామాలయం వద్ద భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సీలేరు పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదం స్వీకరించారు.





చింతపల్లిలో సాయంత్రం ఆరు గంటలకు పోలీసు స్టేషన్ నుంచి బయటకు వచ్చిన అంగన్‌వాడీ కార్యకర్తలు... అరకులోయ రోడ్డుపై అంగన్‌వాడీల ర్యాలీ

కొనసాగిన అంగన్‌వాడీల నిరసనలు

చింతపల్లి/అరకులోయ/ముంచంగిపుట్టు/జి.మాడుగుల/గూడెంకొత్తవీధి/పెదబయలు/డుంబ్రిగుడ/జనవరి 22: మన్యంలో సోమవారం అంగన్‌వాడీల సమ్మె, నిరసనలు కొనసాగాయి. చలో విజయవాడ కార్యక్రమానికి బయలుదేరిన అంగన్‌వాడీ కార్యకర్తలను ఎక్కడికక్కడ పోలీసులు అరెస్టు చేయడంతో చింతపల్లి, అరకులోయ, ముంచంగిపుట్టు, పాడేరు, జి.మాడుగుల, గూడెంకొత్తవీధి, పెదబయలు, డుంబ్రిగుడ తదితర మండలాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు వామపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీలు, రాస్తారోకోలు నిర్వహించారు. చింతపల్లిలో వర్కర్స్ యూనియన్ మండలాధ్యక్షురాలు పాంగి పెంటమ్మను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. అలాగే అంగన్‌వాడీ కార్యకర్తలు కె.సత్యవతి, రమణశ్రీ, పి.నాగరత్నం, సీహెచ్. కనకమహాలక్ష్మి, సోమేశ్వరిలను అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కి తరలించారు. సింగి జంక్షన్‌లో 11మంది అంగన్‌వాడీ కార్యకర్తలను సాయంత్రం వరకు పోలీసుల నిర్బంధంలో ఉంచారు. నర్సీపట్నం నుంచి తుని వెళుతున్న పది మంది కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని నాతవరం పోలీసు స్టేషన్‌కి తీసుకొని వెళ్లినట్టు సీఐటీయూ నాయకులు తెలియజేశారు. పోలీసుల నిర్బంధంలోనున్న అంగన్‌వాడీ కార్యకర్తలను సాయంత్రం ఆరుగంటలకు వ్యక్తిగత పూచికత్తుపై విడిచిపెట్టారు. అరకులోయ సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అలాగే నాలుగు రోడ్లపై కూడలిపై మానవహారంగా ఏర్పడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంగన్‌వాడీల సంఘం కార్యదర్శి నిర్మల, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడగు పొద్దు బాలదేవ్ తదితరులు పాల్గొన్నారు. ముంచంగిపుట్టులో గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యుడు కె.త్రినాథ్ ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగించారు. ఐసీడీఎస్ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీగా వెళ్లి రాస్తారోకో చేసి రహదారిని దిగ్బంధించారు. జి.మాడుగుల రామాలయంలో సీతారాముల విగ్రహాలకు వినతిపత్రం అందించిన వినూత్నంగా నిరసన తెలిపారు.

సంక్షిప్తంగా..



అధికారులతో మాట్లాడుతున్న పీవో అభిషేక్

25న సెల్ టవర్ ప్రారంభం

డుంబ్రిగుడ, జనవరి 22: మండలంలోని లైగండ గ్రామంలో సీఎం జగన్ వర్చువల్ విధానంలో సెల్ టవర్ ప్రారంభిస్తారని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అభిషేక్ తెలిపారు. ఈ మేరకు గ్రామంలో సోమవారం ఆయన పర్యటించి టవర్ ఏర్పాట్లపై అధికారులను ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాలకు సిగ్నల్ సదుపాయలు పెరుగుతున్నాయని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 300 సెల్ టవర్లను ప్రారంభిస్తారని చెప్పారు. సెల్ టవర్ల నిర్మాణాలతో మారుమూల గిరిజన ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువవుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఈఈ వేణుగోపాల్, తహసీల్దార్ నాగమ్మ, ఎంపీడీవో ఉషారాణి, ఏఈ అభిషేక్, సర్పంచ్ లక్ష్మి పాల్గొన్నారు.

భీమిలిలో సీఎం సభకు తరలిరండి

- ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

చింతపల్లి, జనవరి 22: భీమిలిలో ఈ నెల 27న జరిగే సీఎం సభను పార్టీ నాయకులు, కార్యకర్తలు, తరలిరావాలని ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. పాడేరు నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు అధ్యక్షతన చింతపల్లి, జీకే వీధి మండలాల కార్యకర్తలతో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనివార్య కారణాల వల్ల ఈ నెల 25వ తేదీన జరగాల్సిన సీఎం సభ 27కి వాయిదా వేయడం జరిగిందన్నారు. ఎన్నికల సన్నద్ధత కోసం ఏర్పాటు చేస్తున్న ఈ సమావేశాన్ని నాయకులు ప్రాముఖ్యంగా తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ కోరాబు అనుషదేవి, జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, పార్టీ మండల అధ్యక్షుడు మోరి రవి, జీకే వీధి ఎంపీపీ బోయిన కుమారి, జీకే వీధి పార్టీ మండల అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, ట్రైకార్ డైరెక్టర్ లోవరాజు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీల ప్రజా వేదిక రేపు

కొయ్యూరు, జనవరి 22: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల తనిఖీలకు సంబంధించి ఈ నెల 24న ప్రజా వేదిక నిర్వహిస్తామని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో రాజు తెలిపారు. పథకంలో గత ఏడాది డిసెంబరు నుంచి ఈ ఏడాది జనవరి మధ్య కాలంలో మండలంలో నిర్వహించిన పనులపై 33 పంచాయతీలలో సోషల్ ఆడిట్ జరిగిందని చెప్పారు. ఈ వివరాలను స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జరగనున్న ప్రజా వేదికలో వివరిస్తారని ఆయన తెలిపారు. మండలంలోని 33 పంచాయతీల ప్రజా ప్రతినిధులు, ఉపాధి పథకం ఉద్యోగులు, కూలీలు, ప్రజలు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

నర్సీపట్నం-గుమ్మిరేవుల బస్సు సర్వీస్ పునరుద్ధరించరూ...

సీలేరు, జనవరి 22: నర్సీపట్నం-గుమ్మిరేవుల బస్సు సర్వీస్‌ను తక్షణమే పునరుద్ధరించాలని గుమ్మిరేవుల మాజీ సర్పంచ్ బాబూరావు, గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. సోమవారం విలేకరులతో వారు మాట్లాడుతూ జీకే వీధి మండలం ధారకొండ నుంచి గుమ్మిరేవుల వరకు సుమారు 20కి పైగా గిరిజన గ్రామాల ప్రజలకు ఈ బస్సు ఎంతో సౌకర్యంగా ఉండేదన్నారు. ఐదేళ్లుగా నడుపుతున్న ఈ బస్సును ఆర్టీసీ అధికారులు అర్థాంతరంగా నిలిపివేయడంపై ఈ ప్రాంత గిరిజనులు అసహనం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ప్రతీ రోజు నర్సీపట్నం ఆర్టీసీ కాంప్లెక్సులో ఉయయం 4.30 గంటలకు బయలుదేరి చింతపల్లి, గూడెంకొత్తవీధి, ధారకొండ మీదుగా గుమ్మిరేవుల వెళ్లి, మరలా అదే మార్గంలో నర్సీపట్నం చేరేదని, దీనివల్ల ధారకొండ గుమ్మిరేవుల పంచాయతీల్లో పని చేసే వివిధ శాఖల ఉద్యోగులతో పాటు 20కి పైగా గ్రామాల గిరిజనులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేదని చెప్పారు. మారుమూల గ్రామాల్లో రహదారులు, మౌలిక సదుపాయాలు కల్పిస్తే అభివృద్ధి చెందుతాయని ప్రభుత్వం పదేపదే చెబుతూనే, మరోపక్క ఉన్న సౌకర్యాన్ని రద్దు చేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. నర్సీపట్నం పీటీడీ అధికారులు తక్షణమే స్పందించి ఈ బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలని వారు వేడుకున్నారు.

అనాథ పిల్లలను ఆదుకుంటాం

- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర



అనాథ పిల్లలను పరామర్శిస్తున్న చైర్‌పర్సన్ సుభద్ర

ముంచంగిపుట్టు, జనవరి 22: మండలంలోని మారుమూల కుమడ పంచాయతీ సిరిలిమెట్ట గ్రామంలో తల్లిదండ్రులను కోల్పోవడంతో అనాథలుగా మారిన ముగ్గురు అన్నాచెల్లెళ్లకు ఆదుకుంటామని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర హామీ ఇచ్చారు. సోమవారం సిరిలిమెట్ట గ్రామాన్ని సందర్శించి అనాథ పిల్లలను పరామర్శించారు. తండ్రికి మతిస్థిమితం సక్రమంగా లేకపోవడం వలన సుమారు పదేళ్ల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతను నేటికీ తిరిగి రాలేదని, తల్లి గత కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందిందని ముగ్గురు పిల్లలు వి.చిట్టిబాబు, అనిత, సంజన జడ్పీ చైర్‌పర్సన్‌కు ఎదుట వాపోయారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనాథ పిల్లలకు రేషన్, ఆధార్ కార్డులు లేవని, దాని కారణంగా ప్రభుత్వ పథకాలకు దూరమౌతున్నారని, వారు జీవనం సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారన్న విషయండ తెలియడంతో ఇక్కడకు రావడం జరిగిందని తెలిపారు. బాధిత అన్నాచెల్లెళ్లను మండల కేంద్రానికి తీసుకువెళ్లి వారికి ఆధార్, రేషన్ కార్డులకు దరఖాస్తులను పెట్టించడంతో పాటు వారికి ప్రభుత్వ పథకాలు అందే విధంగా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసామన్నారు. ఆధార్ కార్డు వచ్చిన వెంటనే చిట్టిబాబుకు దివ్యాంగుడి పెన్షన్ మంజూరు చేయిస్తమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాయికిరణ్, తహసిల్థార్ నర్సమ్మ, వైసీపీ నాయకులు జేవీవీఎస్ మూర్తి, ఎ.జగబందు పాల్గొన్నారు.